# మమత

"ఎందుకే రంగనాయకీ బీరువా తీశావ్?"

రంగనాయకమ్మ ఒకసారి వెనక్కు చూచింది. చావడిగది వెనుకవైపున ఉన్న పడక గదిలో నుండి లోపలకు వస్తూ ఆపిల్ల బీరువా దగ్గర ఏమిచేస్తున్నదా అని అనుమానం కలిగి గుమ్మం దగ్గరే నిలబడ్డారు కృష్ణయ్య గారు.

అయన మాటలు విన్పించినా కూడా ఆ పిల్ల ఏమీ మాటాడలేదు.

పైగా ఆయనకూ ఆ చిన్న బీరువాకూ అడ్డంగా జరిగి నిలబడ్డది. నెమ్మదిగా మరో క్షణం తర్వాత "ఏం లేదు నాన్నగారూ!" అని మాత్రమే సమాధానం చెప్పింది రంగనాయకమ్మ కొంచెం తడబడతూ. ఆయన అప్పుడే నిద్రలేచి వస్తారనుకోలేదా అమ్మాయి. అందుకే వెంటనే సమాధానం చెప్పలేక పోయింది.

రంగనాయకమ్మ అల్లా అంటూనే తానింతసేపూ పాతవిషయాలు నెమ్మదిగా స్ఫురణకు తెచ్చుకుంటూ సంతృప్తి చెందుతూ, పరిశీలనగా చూస్తూ, ఎంతో అప్యాయంగా స్పృశిస్తూ ఉన్న పట్టుచీరలను చప్పున లోపలకు నెట్టి వాటిపై ఇతర గుడ్డలు కప్పినట్లుగా కప్పి ఏదో సర్దినట్లు నటించింది. పమిటకొంగుతో అక్కడక్కడ అలాఒకసారి దుమ్మూ ధూళీ దులిపినట్లు దులిపింది. ఒక్క క్షణంలో ఆ పని పూర్తిచేసి బీరువాతాళం త్రిప్పి తాళంచెవి బొడ్డులో దోపుకొని వెనక్కు తిరిగి తండ్రి అప్పుడే బయటకు వెళ్లడానికి సిద్ధమై వచ్చినట్లు గమనించింది. ఆయన సాయంత్రం పూట ఇస్త్రీబట్టలు వేసుకొనడం చూచి ఏదో ప్రత్యేకత ఉన్నట్లున్నదనుకొంటూ రంగనాయకమ్మ కొంచెం ఆశ్చర్యపడుతూ

"ఏదైనా పనిమీద వెళ్ళుతున్నారా నాన్నాగారూ?" అని అడిగింది. ఏదో ఒకటి అడిగి ఆయన్ను వేరే మరొక సంభాషణలోకి దింపుదామనికూడా అనుకొన్న దా పిల్ల. "పెద్ద పనేమీ కాదమ్మా- అలా మీటింగుకు పోయొద్దామని బయల్దేరాను పోనీ నువ్వూ రాకూడదూ?" అన్నారు కృష్ణయ్య గారు. "నే నెందుకు లెండి నాన్నాగారూ! మీరు వెళ్ళిరండి" "ఏం! ఇప్పుడు మరేం వనుందీ నీకుమట్టుకూ..." అని కృష్ణయ్యగారు రంగనాయకమ్మ వంక చూచారు. "ఆఁ మర్చిపోయాను. అది సరేగాని అబీరువా తీసి ఏం చేస్తున్నావే?" అని మళ్ళీ ఎక్కడ అడుగుతారో అని రంగనాయకమ్మ భయపడ్డది. సరే ఇల్లాగయినా ఆ సందర్భం రాకుండా చెయ్యవచ్చుననికొంటూ ఆ పిల్ల "అబ్బే పనేముందీ వస్తాను. నేను- ఆడపిల్లలు రావచ్చో రాకూడదో అనుకొని అల్లాఅన్నానండీ" అన్నది "ఓ శుభ్రంగా రావచ్చు- ఊఁ మరి బయలుదేరు పోదాం" అన్నారు కృష్ణయ్యగారు నెమ్మదిగా వెళ్ళి పడక కుర్చీలో కూర్చుంటూ. రంగనాయకమ్మ "నాన్నగారు మరో ధ్యానలో ఉన్నారు గనుక సరిపోయింది లేకపోతే..." అనుకుంటూ లోపలకు వెళ్ళింది. ఏదో ఆలోచనలో ఉండే కృష్ణయ్య గారు వంట ఇంట్లోకి వెళ్ళుతున్న రంగనాయకమ్మ వంకచూచారు. అల్లాచూచి ఆయనోసారి ఉలికిపడి చప్పున కళ్ళు నలుపుకున్నారు. అంతలో "అబ్బే దాని పోలిక వేరు" అనుకున్నారు అల్లా అనుకుంటూ ఆయన అటేచూస్తూ ఉండిపోయారు. రంగనాయకమ్మ నెమ్మదిగా అల్లా నడిచి వెళుతూంటే ఆ పిల్ల బాల్యం జ్ఞాపకం వచ్చింది. ఆయన వెనక్కు వంగి ముందుగదిలోకి వెళ్ళే ద్వారానికి పైగా గోడకు వ్రేలాడుతున్న ఫొటోవైపు చూచారు. కాని ఆయనకా ఫొటో కన్పించలేదు అది ఇంకా కొంచెం ఎత్తుగా ఉన్నది. మరుక్షణంలో ఆయన దృష్టి ఎదురుగాఉన్న బీరువాపైకి మళ్ళింది. కృష్ణయ్యగారు దానివంకే చూస్తూ కూర్చున్నారు. దాని విషయమే

ఆలోచిస్తున్నారు కూడానూ. కాని పైకి ఆలోచనా రహితంగా, శూన్యంలోకి చూస్తున్నట్లుగా కన్పించారు. "నాన్నాగారూ! అంటూ రంగనాయకమ్మ కాఫీగ్లాసు అందిస్తూ పలకరించే వరకూ ఆయన ఆ స్థితిలోనే ఉన్నారు.

"ఆఁ - ఏమిటమ్మా" అంటూ ఆయన మామూలు స్థితిలోకివచ్చి నడుమెత్తి కూర్చుంటూ, కాఫీగ్లాసు అందుకొని "ఇప్పుడు కాఫీ ఎందుకే అమ్మాయ్" అన్నారు కృష్ణయ్యగారు ఎప్పుడోగాని మధ్యాహ్నం పూట నిద్రపోరు. అల్లా నిద్రపోవడం తటస్థపడితే ఇక ఆసాయంత్రం మంతా ఎదో బద్ధకంగా ఉన్నదంటుంటారు. పరధ్యాహ్నంగా కన్పిస్తారు. అల్లాంటి సమయాల్లో కానిని కాఫీ పెట్టివ్వమ్మా అని రంగనాయకమ్మను అడుగుతూ ఉండడముకూడా కద్దు. ఆ విషయం తెలుసుకొనే రంగ నాయకమ్మ కాఫీఇస్తూ "ఎప్పుడయినా ఇల్లా తాగుతారు కదండీ నాన్నాగారూ- తీసుకోండి" అన్నది. కృష్ణయ్యగారు కాఫీ అప్యాయంగానే త్రాగబోతూ "ఆఁ - మంచిపనే చేశావమ్మాయి-అయితే..." అంటూ రంగనాయకమ్మ వంక పరీక్షగా చూచి "అరె! అప్పుడే బట్టలుకూడా మార్చుకొన్నావే! ఎంతత్వరగా ముస్తాబై వచ్చావే రంగనాయకీ? మీ..." అని ఆగిపోయి కాఫీగ్లాసు పైకెత్తి కాఫీ తాగబోతూ మాట మధ్యలో ఆపి నట్లు కన్పించి మరుక్షణంలో కాఫీ గబగబా తాగేసి ఇక ఆ మాట మర్చి పోయినట్లు నటించి, కుర్చీలోంచి చప్పున లేస్తూ "నా ఉత్తరీయం ఇలా అందుకోమ్మా, మరి పోదాం" అన్నారు ముందు గదిలోకి నడుస్తూ. కృష్ణయ్యగారికి ముందు చాలదూరం నడువవలని ఉన్నది కదా అని అనిపించింది.

* * *

"ఎక్కడికి వెళ్ళావే రంగనాయకీ యింత ఆలస్యం చేశావ్?" అని నెమ్మదిగా అడిగారు కృష్ణయ్యగారు.

" మధ్యాహ్నం నా స్నేహితురాలు లీల వచ్చింది. నాల్గింటిదాకా ఇక్కడే కూర్చున్నాము నాన్నాగారూ! అది వాళ్ళయింటిదాకా వచ్చి వెళ్లమని మరీ బలవంతం చేస్తే వెళ్ళివచ్చాను. మీరు వచ్చి ఎంత సేపయ్యిందండీ?" అని చెప్పి ఎంతో పొంకంగా అడిగింది. రంగనాయకమ్మ "అబ్బే యిప్పుడే వచ్చానమ్మా" అని ఆగి "సరేగానమ్మాయ్ కాఫీ ఏమైనా వున్నదీ?" అన్నారాయన మరికొంచెం నెమ్మదిగా.

" ఏం? కావాలా నాన్నగారు - అరకప్పు కాఫీ ఎంత సేపూ-ఒక్క పది నిముషాల్లో పెట్టి తెస్తానుండండి" అంటూ లోపలకు వెళుతూంటే "మరోకప్పుకూడా కావలసి వస్తుందమ్మా" అన్నా రాయన.

"ఎవరైనా - మీ బ్యాంకు ప్రెసిడెంటు గారేమైనా వస్తున్నారా?"

"అబ్బే కాదు"

"మరెవరబ్బా, రామసుబ్బయ్యగారా?"

"ఊఁ హూఁ; కాదమ్మా..."

కృష్ణయ్యగారు చెప్పడానికి తట పటాయించారు. కొంత సేపటి నుండీ అసలు ఇంటికి వచ్చినప్పటినుండికూడా ఈ విషయం చెప్పడం, ఎల్లాగా అని దీర్ఘంగానే ఆలోచిస్తున్నారు. అయినప్పటికీ అది అప్పుడే ఎత్తుకొన్న విషయంలా కన్పించింది. ఆ క్షణంలో క్రొత్తగా ఎదురైన ప్రశ్నలా కన్పించిదది. మామూలుగా అయితే ఫలానా స్నేహితుడు; కాదూ ఫలానావారు, ఇందుకోసం వస్తున్నారమ్మా అని కృష్ణయ్యగారు చెప్పేవారే. కొన్నిసార్లు రంగనాయకమ్మ అడక్కముందే చెప్పి "త్వరగా కానియ్" అని పనులు పురమాయించి త్వర పెట్టేవారే. అందువల్ల ఇప్పుడు ఏమాటా చెప్పకపోయేసరికి రంగనాయకమ్మ ఒక్కక్షణం

ఆలోచన చేసింది. మరి రెండు మూడు క్షణాలు తర్వాతకూడా కృష్ణయ్యగారు ఆ విషయం ప్రస్తావింపకపొయ్యేసరికి రంగనాయకమ్మకు ఒక అభిప్రాయం తోచింది. ఇక ఆ పిల్ల తండ్రి చెప్పబోయే సమాధానం కోసం వేచిఉండక లోపలకు దారితీసింది.

ఆ పిల్ల కొంచెం సిగ్గుపడ్డట్లు కన్పించింది. పెళ్ళికూతురులా సిగ్గుపడుతూ నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ కొన్ని అడుగులు ముందుకు వెళ్ళాక చప్పున లోపలకు పరుగు తీసింది.

ఇదంతా కృష్ణయ్యగారు గమనించారు. ఆయన హృదయం ఒక్కసారి కలుక్కుమన్నది. ఎదురైన సమస్య మరింత జటిలతరమైనదిగా కన్పించిం దాయనకా క్షణంలో. రంగనాయకమ్మకు ఏ మాత్రపు కష్టమూ కలుగకుండా ఆ పిల్ల ఏ విధంగానూ అన్యథా భావించకుండా అసలు విషయం నెమ్మదిగా చెప్పడము ఎల్లాగా అని కృష్ణయ్యగారు తీవ్రంగానే ఆలోచన ఆరంభించారు మళ్ళీ త్వర త్వరగా మాటలు కూడబలుక్కొన్నారు లోపల్లోపలనే. తన ఆలోచన పూర్తికాకముందే ఆయన రంగనాయకమ్మను ఓసారి పిలిచారు. ఏదోలా ఆరంభించేస్తే ఎల్లాగో చెప్పేయడం జరుగుతుందిలే అనుకుంటూ. త్వర త్వరగా ముఖం కాళ్ళు చేతులూ కడుక్కొని ఇస్త్రీచీర భుజాన వేసుకొని వెనుకవైపు గది గుమ్మందాకా వచ్చి రంగనాయకమ్మ "కాఫీత్వరగానే చేసి తెస్తున్నానండి నాన్నగారూ!" అని కొంచెం పెద్దగా చెప్పి చప్పున లోపలకు వెళ్ళింది. "అది కాదమ్మా" అంటూ లేచి గుమ్మందాకా వెళ్ళిన కృష్ణయ్యగారు మళ్ళీవచ్చి పడక కుర్చీలో నడుము వాల్చారు. వంట ఇంట్లో అవుతున్న గిన్నెల చప్పుడూ, కుంపటిముందు విసనకర్రతో నేలమీద టపటప కొడుతుంటే అవుతున్న ధ్వనీ వింటూనే మరో ప్రక్క "ఇప్పుడయినా ముందుగా చెప్పకపోతే ఎల్లా?" అని ప్రశ్నించుకొన్నా రాయన. కాని రంగనాయకమ్మతో ఆ విషయము ఆయన తానుగా

చెప్పేయడ మన్నది తెల్లవార్లూ ఓపిగ్గా కూర్చొని జాగ్రత్తగా ఆలోచించిన మీదటకూడా ఆయనవల్ల జరిగి ఉండేదికాదు. అది ఆయనకు సాధ్యమయ్యేదికాదు. సందర్భం మరొకలా తటస్థపడి ఉండకపోతే కృష్ణయ్యగారికి ఆలోచన తెమిలేదికాదు.

ఆలోచన తెగక ఆయ నల్లా సతమవుతుండగా వీధి గుమ్మంలో చప్పుడయింది "ఎవరో వచ్చినట్లున్నారే...ఎవరబ్బా అది!...అరె అప్పుడే వచ్చేయడం కూడానా" అని అనుకుంటూ, నణుక్కొంటూ కృష్ణయ్యగారు లేచి ముందుగదిలోకి వచ్చి ముఖద్వారందాకా వెళ్ళేసరికే "ఏమండీ" అంటూ ఆయన ఇంతసేపూ ఎదురుచూస్తూన్న అతిథి—ఆవిడ—పచ్చగా లావుగా, ఆకర్షణ అన్నది బాగా అభ్యాసవశం చేసుకున్న - ఓ మోస్తరుగా ఆరోగ్యంగానే కన్పిస్తున్న - ఆవిడ అనవసరంగా పెట్టుకున్న చలువ కళ్ళజోడు సవరించుకుంటూ చరచరా లోపలకు వచ్చేసింది. వస్తూనే "చూశారా మరి నేను వస్తాను అంటే వచ్చేశాను, మీరు బహుశా నేను రాననే అనికొనిఉంటారు. సరేగానండి కృష్ణయ్యగారూ! మీ యిల్లు చాల నీటుగా ఉంచారే- ఇంత విశాలమైన యిల్లు శుభ్రంగా ఉంచడం నిజంగా కష్టమైన పనే మొగాళ్లకు. ఆ మర్చిపోయాను; మీ అమ్మాయి - అమ్మాయి ఇక్కడే ఉందన్నారు కదూ? అవునవును ఆరోజు మీటింగుకు కూడా తీసికొచ్చారు. ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందిలెండి - ఏ దమ్మాయి" అంటూ ఆవిడ గడబిడిగా మాటాడేస్తుంటే కృష్ణయ్యగారు సమస్యా పరిష్కారం ప్రయత్నంలో నుండి అ ప్రయత్నంగా బయటపడినా, అనుకొన్న ప్రకారం - నిజానికి ఆయన ఒక నిర్ణయానికి వచ్చి ఏమీ ఇదమిద్ధంగా అనుకోకపోయినా ఒక పద్ధతి ప్రకారం జరుగడానికి వీలుకాక పోయిందే అని చాల తికమక పడ్డారు. అందుకే వెంటనే ఆవిడతో సంభాషణ అందుకోలేకపోయ్యారు.

ఆవిడ మళ్ళీ అడిగిన మీదట కృష్ణయ్యగారు నెమ్మదిగా "అమ్మాయా - లోపల ఉన్నది. వస్తుంది; కాఫీతేవడానికి వెళ్ళింది." అంటూ కుర్చీ చూపించి కుర్చోమని సంజ్ఞచేశారు. అందు కావిడ "ఇది మరీ బాగున్నదండోయ్ కృష్ణయ్యగారూ- నాకు కాఫీ కావాలంటే లోపలకు పోయి తెచ్చుకోలేనూ. ఆ మాత్రం చేతకాదనుకున్నారా? నాకే కాదు మీకూ తెస్తానుండండి" అంటూ లోపలకు వెళ్ళబోతుంటే కృష్ణయ్య గారు అప్పటికి పరిస్థితి పూర్తిగా అవగతం కావడాన వెంటనే ఆవిణ్ణి వారించి "అమ్మాయి తెస్తుంది ముందు..." అని వాక్యం పూర్తి చెయ్యడం మానేసి కూర్చోమని సంజ్ఞ చేశారు మళ్ళీ

ఆవిడ కొంచెం ఆశ్చర్యపడుతూనే కూర్చున్నది. కొంచెం వినయం ప్రదర్శిస్తూ ఆవిడ కూర్చోవడము చూచి కృష్ణయ్యగారు కొంచెం స్తిమిత పడ్డారు... ఇప్పుడు కనుక వారించి ఉండకపోతే ఈవిడ సరాసరి లోపలకు వెళ్ళడమూ, క్రొత్తవాళ్ళతో మాట్లాడే అలవాటు రంగ నాయకమ్మకు బొత్తిగా లేకపోవడముచేత ఈవిడకు మర్యాద జరక్క పోవడమూ, అందుమీదట ఈవిడ కోపగించుకుని అందులోనూ మరీ మాటకారి కావడంచేత ఏదో అనేయడమూ, అది కష్టపెట్టుకోవడమూ, ఇంతాఒక్క నిమిషంలో జరిగి పోయ్యేవే ఇంకా నయం" అనుకొన్నారు కృష్ణయ్యగారు.

రంగనాయకమ్మకు కొద్దిగా పరిచయమున్న వాళ్లతోనే, బంధువులతోనే బహుస్వల్పంగా అతిముభావంగా మాటాడడం అలవాటు. ఆ పిల్ల స్వభావమే అంత కృష్ణయ్యగారి స్వభావముకూడా దాదాపు అల్లాంటిదే కనుక రంగనాయకమ్మ సంగతి ఆయనకు మరింత బాగా తెలుసును. ఆ సంగతి ఇప్పుడాయనకు మళ్ళీ ఒకసారి జ్ఞాపకం వచ్చే సరికి తను నిజంగా చిక్కులో పడ్డట్లే అనిపించింది. జాగ్రత్తగా ఆలోచించిన కొద్దీ తన కెదురైన సమస్య మరింత జటిలమైనదిగా

స్పష్టం కాజొచ్చింది "అయితే ఇప్పుడేం చెయ్యడం?" అని కృష్ణయ్య గారు మరల మరల ప్రశ్నించుకొన్నారు. ఆయనకు సమాధానం దొరకలేదు.

ఆవిడ కృష్ణయ్యగారి మౌనాన్ని గమనిస్తూ ఎక్కువసేపు ఉండలేక పోయింది. "అదేమిటండీ కృష్ణయ్యగారూ, అల్లా కూర్చున్నారేమిటి? మరీ అంతమౌనం పనికిరాదన్నారు. పెద్దలు. ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లున్నారు; ఏమిటండీ అంత ఆలోచన చేయవలసిన విషయం ఏమొచ్చిందీ?...ఈ యిల్లు ముందు ముందు చాలదేమోననా - అసలు మనవాళ్ళు ఏమన్నారంటే - ఇల్లుఇరకటం, ఆలి-ఆలి మర్కటం కాక పోయినప్పుడు కనీసం ఇల్లయినా ఇరుగ్గా ఉండనియ్యటం మంచిది. ఏమంటారూ" అంటూ ఆవిడ తనమాటలకు తనే సంతోషిస్తూ ఒకసారి పెద్దగా నవ్వేసింది. ఒక్కక్షణం ఆగి మరోసారి పగలబడి నవ్వింది. ఇంకా నవ్వు ఆపుకుంటూ తనూ విలాసం ఆయనముందు ప్రదర్శిస్తూ లేచి నిలబడి ఒకటి రెండు క్షణాలు ఎటో చూస్తూ ఉండిపోయి, మళ్ళా అంతలో దృష్టి అంతా ఆయనపై కేంద్రీకరించి ఆయన దృష్టి నాకర్షించి కులక వలసిన వయస్సు ఎప్పుడో గడిచి పోయినా కులుకుతూ సుకుమారంగా కూర్చుంటున్నట్లు నటిస్తూ, మరల యధాస్థానంలో కూర్చున్న దావిడ.

ఆ సందడి విని రంగనాయకమ్మ అక్కడికి వచ్చింది "అప్పుడే వాళ్ళు వచ్చేశారా" అనుకొంటూ హాల్లోంచి ముందు గదివైపుకు వచ్చి నెమ్మదిగా "నాన్నగారూ!" అంటూ గుమ్మందగ్గరే నిలబడి పరజా తొలగించుకొని తొంగిచూచుకుంది. మరెవ్వరూ మొగవాళ్ళు కన్పించక పోయేసరికి ధైర్యంగా లోపలకు అడుగు పెట్టిందా పిల్ల.

గోడప్రక్కగా కుర్చీలో-కృష్ణయ్యగారితో సమానంగా, దర్జాగా కూర్చొని ముసిముసి నవ్వులు నవ్వుతున్న ఆవిడ కన్పించింది. రంగనాయకమ్మ ఆవిడను చూచి - ఓ క్షణం నిర్ఘాంతపడిపోయి, ఏదో జ్ఞాపకంవచ్చి ఏదో అనబోయి, అతి ప్రయత్నంమీద, కలిగిన ఆశ్చర్యాన్ని, తాను అప్రయత్నంగా అనబోయే మాటనూ, అణచేసుకొని చప్పున వెనక్కు తిరిగి వెళ్ళిపోబోతుంటే కృష్ణయ్యగారు "ఫరవాలేదు రా, అమ్మాయి; ఇటు రా" అని పిలిచారు కాని రంగనాయకమ్మ త్వరత్వరగా లోపలకు వెళ్ళి పోయింది వెనక్కు తిరిగి చూడకుండా.

ఆ వెళ్ళడము కోపంగా వెళ్ళినట్లుగా వెళ్ళింది. ఒక్క క్షణంలో చావడి గది గుమ్మం కూడా దాటి వంటఇంట్లోకి వెళ్ళిపోయింది. రంగనాయకమ్మ వెళ్ళిన తీరు కృష్ణయ్యగారు గమనించారు. చూడడమయితే ఆవిడా చూచిందికాని అసలు విషయం గ్రహించలేక పోయింది. అనలేమీ అర్థం కా లే దా మె కు అందుకు ఒక్క రవ్వంత ప్రయత్నముకూడా చెయ్యలే దావిడ. పైగా అదేమిటండీ కృష్ణయ్యగారూ మీ అమ్మాయి మీరు ఒకప్రక్కన పిలుస్తున్నా అల్లా వెళ్ళిపోతుందేమిటి? పిల్ల కొంచెం పెంకిఘటంలాగుందే చూడబోతే? కాస్తయినా మేనరుస్ లేవేమిటి? తనంతట తను అథితుల్ని పల్కరించి సత్కరింపపోగా మీరు పిలిచినా అలా పరుగెడుతుందేం?" అంటూ ఆవిడ లేచి నిలబడి కృష్ణయ్యగారి వంక చూస్తూ "అదీగాక అసలూ ఆ పిల్ల అంటే ముందు మీకే భయంలాగున్నదే - అవునాండీ-" అని మళ్ళీ ఎందుకో ఒక్కక్షణం సీయవాగ్విజృంభణము ఆపి ఒకటి రెండు అడుగులు అటూ ఇటు నడిచి ఏదో ఆలోచిస్తున్నట్లుగా ముఖం పెట్టి, గడ్డంక్రింద చూపుడువేలితో నొక్కుకుంటూ "అవునదే నిజ మనిపిస్తుంది. మీకు నిజంగా అటువంటి భయము లేకపోతే ఇందాక

లోపలకు వెళ్లబోతుంటే ఆటంక పరచేవారు కాదు. ఇప్పుడర్థమవుతున్నదీ లెండి..." అని యింకా ఏమో అనబోతుంటే ఆవిడ మాటకు అడ్డువచ్చి కృష్ణయ్యగారు "అబ్బే అనవసరంగా అపార్థాలు చేసుకోకు. అమ్మాయి సిగ్గుపడుతున్నది. అంతే అన్నారు.

ఆమాటమీద ఆవిడ ఎంతో ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ "అంటే మీ అమ్మాయి నన్ను చూచి సిగ్గుపడుతున్నదా? చాలా వింతగా ఉన్నదే; ఆడవాళ్లను చూచి ఆడపిల్లలు సిగ్గుపడడం నామట్టుకు నాకు క్రొత్తగా ఉన్నది. నే నెక్కడా చూడలేదండీ- అబద్ధం- నేను మాత్రం సంఘంలో తిరగడంలేదా నలుగుర్నీ చూడడంలేదా" అంటూ తగూకు సిద్ధమవు తున్నట్లుగా కన్పించింది.

"ఎవరో పెళ్ళిచూపులకు వచ్చారనుకొన్నది" చప్పున అనేశారు కృష్ణయ్యగారు. అబద్ధమైనా తడుముకోకుండా అనేశారు. ఇది మొదట తాను అన్నమాటను సమర్థించు కోవడానికి అన్నమాట అని ఆయనకు తెలుసును రంగనాయకమ్మ ఆలా వెళ్ళిపోవడం సిగ్గుపడి కాదని కృష్ణయ్య గారికి తెలిసికూడా గడ్డుగా కన్పించిన పరిస్థితినుండి ఏదో విధంగా చప్పున తప్పుకోవడానికి, అప్పటికేదో తప్పించుకొని పోవడానికి అల్లా అన్నందుకు ఆయనకు కొంతబాధ కలిగిందికూడానూ.

అల్లా అని. అప్పటికి ఆవిణ్ణి కొంచెం శాంతపరచి కృష్ణయ్యగారు కుర్చీలోనుండిలేచి "నేనిప్పుడే వస్తాను" అని ఆవిడతో చెప్పి నెమ్మదిగా లోపలకు వెళ్ళారు. రంగనాయకమ్మతో అన్ని విషయాలు నెమ్మదిగా సర్ది చెబుదామని అనుకుంటూ, అందుకు ఏమేమి ముందూ ఏమేమి తర్వాతా చెప్పాలో లోపల అనుకుంటూ వెళ్ళారు.

* * *

"సాయంకాలం మీకోసం ఆ శరభయ్య వచ్చాడండీ నాన్నగారూ!'

"ఆఁహాఁ - ఏమన్నాడూ!"

"ఏమనలేదండీ. ఏవో కాగితా లవీ ఇచ్చి వెళ్ళాడు. అవన్నీ సంతకాలు పెట్టి పట్టుకొని రమ్మన్నాడు మిమ్మల్ని" అని చెప్పి రంగ నాయకమ్మ ఆ కాగితాలు కృష్ణయ్యగారి చేతికి అందిస్తూ నెమ్మదిగా "నాన్నగారూ! అప్పుతీసుకుంటున్నారటగా!" అన్నది. "అవునమ్మా" అని మాత్రమే అని ఊరుకొన్నారాయన. "బ్యాంకులో నిలువ సొమ్ము వున్నది కదండీ ప్రస్తుతం అది తీసుకొని వాడుకోండి నాన్నగారూ" అని ఆపిల్ల కాస్త ధైర్యం తెచ్చుకొని చెప్పేనరికి కృష్ణయ్య గారికి ఆశ్చర్యం కలిగింది. అనుకోకుండా సందర్భం రానే వచ్చిందికదా ఉన్న అనుమానం తీర్చుకొందామని అనిపించి కృష్ణయ్య గారు "అయితే అమ్మాయ్, నీ కిష్టమే నన్న మాట?" అని అడిగేశారు. దాదాపు నెల రోజులనుండి ప్రతిరోజూ, ఏదోలా ఆరంభించి స్వవిషయం నెమ్మదిగా చెప్పి ఆపిల్ల అంగీకారాన్నికూడా పొందుదామని కృష్ణయ్య గారు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కాని అది జరగలేదు.

ఏమంటుందా అని కృష్ణయ్యగారు ఒక్కక్షణం ఆత్రుతతో ఉన్నారు మరోక్షణం రంగనాయకి "అదేమిటి నాన్నగారూ, నా కిష్టం లేకపోవడ మేమిటి?" అన్నది.

నిజానికి రంగనాయకమ్మ ఆయన ఇలా అడుగుతారని అనుకోలేదు ఈయన ఎంత మంచివారు కాకపోతే ఇల్లా అడుగుతారూ అని అనుకున్నది. వారి ప్రశ్నకు సమాధానం చెబుతూ కృష్ణయ్యగారు కూతురు మాటలు విని కొంచెం స్థిమితపడ్డారు.

"అయితే ఇంకేం అభ్యంతరం లేదన్న మాటే" అన్నారు కృష్ణయ్యగారు ఆ ప్రయత్నంగా ఆయన లోపల అనుకొన్న మాటలే

పైకి అనేశారు.

రంగనాయకమ్మ ఆయనవంక చూస్తూ ఇంకా అక్కడే నిల్చున్నది. "అదేమిటి నాన్నగారూ మధ్యలో నా అభ్యంతరం ఏ మున్నదండీ, మీకు ఏది సౌఖ్యదాయక మవుతుందో అది చెయ్యండి. నా అభ్యంతరం రవ్వంతకూడాలేదు. మిగతా మంచి చెడ్డలన్నీ మీరు చూచుకోండి. అయినా అదేమీ లోక విరుద్ధమైన విషయం కాదుగా'' అనికూడా చెబుదా మనుకొన్నది అల్లా చెబుదామని ఆ పిల్లకు నిజంగా గట్టిగానే అనిపించింది. కాని అంత పెద్ద మాటలు చెప్పలేకపోయింది. ఎంత ప్రయత్నం చేసినా మరోమాట అయినా చెప్పడానికి శక్తి చాలక పోయింది. ఊరికే అలా తండ్రివంక చూస్తూ ఉండిపోయింది.

కృష్ణయ్యగారు ఒకసారి ఇటు తిరిగేసరికి దగ్గరగా నిలబడి తన వంకే చూస్తూన్న - ఎదిగి వచ్చిన కూతురు, చీరలు కడుతున్న రంగనాయకమ్మ కన్పించింది. ఆ ముక్కు, ఆ నుదురు, ఆ నల్లని వంకులు తిరిగిన నున్నని జుత్తూ. ఆ నిడుపైన చేతులూ, ఆ ఎత్తూ, ఆ విగ్రహం ఆ పిల్ల అచ్చంగా తండ్రిపోలిక. రంగనాయకమ్మ నోసారి అల్లా చూచి "ఇది సరిగ్గా నా పోలిక'' అని క్రితంలో చాలసార్లు అనుకొన్నారు కృష్ణయ్యగారు.

''కాని కళ్లుమాత్రం కావు''

ఎవరో వెనుకనుండి అన్నట్లుగా, నెమ్మదిగా నవ్వుతూ అంటున్నట్లుగా అనిపించింది కృష్ణయ్యగారికి.

రంగనాయకమ్మ వచ్చని పసిమి. ఆ పిల్లది అందమైన కోలముఖం కళ్లు విశాలంగా వికసించిన నల్లకలువల్లా ఉంటాయి. "రంగూ ఈకళ్లు ఇదంతా మీ పోలిక సుమండీ కృష్ణయ్యగారికి పూర్వం భార్య అంటుండే మాటలు ఒకసారి జ్ఞాపకం వచ్చాయి. అల్లా జ్ఞాపకంవచ్చి ఆ పిల్ల

కళ్ళవంక మరోసారి చూచి అది నిజమో కాదో మళ్ళీ ఒకసారి సంశయనివృత్తి చేసుకోవాలనుకొన్నా రాయన. ఇల్లా మమకారం కలిగింది కృష్ణయ్యగారికి. కాని అల్లా రంగనాయకమ్మ కళ్ళకేసి చూడలేకపోయ్యారాయన.

ఇప్పుడే కాదు. గత నెలరోజులనుండి కూడా ఆయన అలా రంగనాయకమ్మ కళ్లకేసి చూడలేక పోతున్నారు. అందుకు కారణం ఆయనకే స్పష్టంగా తెలియదు. ఏదో భయం. "హృదయంలో ఎక్కడో ఒకమూల అయిష్టత అన్నది. దాగి ఉండే ఉంటుంది. అది ఎప్పుడో, ఏక్షణంలోనో, అనుకోకుండానే ఆ కనుల ఏ కోణంనుంచో తొంగి చూడక మానదు" అనుకొంటూ భయపడ్డా రాయన. ఆయన అసలు భయ మదీ 'అవును. అదీకాక అటువంటిది ఉండడంలో పెద్ద అసహజత్వంకూడా ఏమీ లేదు" అని తను రంగనాయకమ్మకు ఉండ గలదనుకొన్న భావాన్ని సమర్థించుకొన్నారు.

అంతేకాదు కృష్ణయ్యగారు గత నెల రోజులుగా దాదాపు ప్రతి రోజు ఇంటికి ఆలస్యంగా వస్తున్నారు. అప్పటిదాకా రంగనాయకమ్మ ఇంట్లో ఒక్కర్తే ఉండవలసి వస్తున్నది; ఏదో ఒక పుస్తకం చదువుతూ ముందు గదిలోనో. ఏదో ఆలోచిస్తూ కునికిపాట్లు పడుతూ ఆ బీరువాకు ఎదురుగ్గా పడకకుర్చీలో నడుమువాల్చి చావడి గదిలోనో గడిపేది తండ్రి వచ్చేదాకా. ఇల్లా వేచివుండి తలుపు చప్పుడుకాగానే లేచి వెళ్ళి తలుపుతీసేది. అల్లా జరిగినప్పుడల్లా కృష్ణయ్యగారు గొప్పచిక్కులో పడుతూ వచ్చారు. "ఇంత ఆలస్యమయిందేమండీ నాన్నగారూ?" అనో, "ఇంట్లో నేను ఒక్కదాన్నీ ఉంటే నాకు భయం కాదటండీ నాన్నగారూ" అనో అంటుందేమోననీ, తన ఆలస్యానికి

కారణం ఎక్కడ తెలిసి పోతుందోననీ ఆయన భయపడుతూవచ్చారు. రంగనాయకమ్మ అడగకపోయినా ఏదో చెప్పాలనే అనుకున్నారాయన కాని మళ్ళీ అంతలోనే "నా మోహం ఏమిచెబుతానూ?" అని ప్రశ్నించుకొనేవారు. "ముందు దాన్ని అత్తవారింటికి పంపేదాకా అయినా ఈ వ్యవహారం వాయిదా వేసుకోవాలసింది. సుమా!" అని నొచ్చుకుంటూ రంగనాయకమ్మ వడ్డిస్తే త్వరత్వరగా భోజనం ముగించి వెంటనే నిద్రకు ఉపక్రమిస్తూ వస్తున్నారాయన. తను అనుకోకుండానే అనివార్యంగానే అయినా తప్పు చేస్తున్నాననే బాధ ఆయనకు ఉంటూ వచ్చింది.

అందువల్ల ఆయన రంగనాయకమ్మ కళ్ళకేసి సమంగా చూడలేకపోయారు. రంగనాయకమ్మ ఇంకా అక్కడే నిల్చున్నది. కృష్ణయ్యగారు ఆ పిల్ల చూస్తూండగానే కావడి పెట్టెలోనుంచి నగల పెట్టెతీసి, చాపమీద పెట్టి, రెండు భాగాలు చేశారు. ఒకభాగంలో వచ్చిన వాటిని రంగనాయకమ్మ చేతికిస్తూ "ఇవి ఇకనుంచి నీపెట్టెలో ఉంచుకో అమ్మా" అన్నారు నెమ్మదిగా "అలాగేనండి నాన్నగారూ-అవిమార్పించి క్రొత్తవి చేయించండి"

"ఎందుకూ మెరుగుపట్టిస్తే సరిపోదూ?"

"అల్లాకాదులెండి నాన్నగారూ - అయినా మీకెందుకా పని. అవి ఇలా ఇవ్వండి - లీలా వాళ్లమ్మ తరచు ఏవో చేయిస్తుంటుంది - ఇవి కూడా ఆవిడద్వారా చేయిస్తాను." అని అంటూ రంగనాయకమ్మ వాటిని అందుకొని అలమారలో పెట్టింది. వాటిని అక్కడ పెట్టడం చూచి "అలమారకు తాళం ఏదైనా వెయ్యమ్మా - పోనీ అవి బీరువాలో పెట్టరాదూ" అన్నారు కృష్ణయ్యగారు.

"అబ్బే ఎందుకండీ, నేను తాళంవేస్తాగా" అన్నది రంగ నాయకమ్మ. అని రంగనాయకమ్మ పెట్టె తాళం తెచ్చి అలమారకు వేస్తుంటే "అదేవిటి రంగనాయకీ పెట్టె తాళం దానికి వేస్తున్నావు? పోనీ బీరువా..." అని ఆగిపోయారు. రంగనాయకమ్మ వెంటనే అందుకొని "నేను ఆ బీరువా మళ్లీ మళ్లీ తీయడం లేదండీ నాన్నగారూ" అన్నది చాలా నెమ్మదిగా. "అది మాటిమాటికీ తియ్యకమ్మా" అని క్రితంలో కృష్ణయ్యగారే చాలా సార్లన్నారు. అందులో రంగనాయకమ్మ తల్లి చీరలూ, జాకెట్టూ, పట్టువీ సాదావీ. క్రొత్తవీ కట్టువిడుపువీ అన్నీ అందులోనే ఉండిపోయాయి. బీరువా తెరిచినప్పుడల్లా ఇటు కృష్ణయ్య గారికీ అటు రంగనాయమ్మకూ బాధగా ఉండేది. మొదట్లో రంగ నాయకమ్మ ఆ బాధను హృదయంలో దాచుకోలేక, పొంగి వస్తున్న కన్నీటిని కళ్లలోనే అణచుకోలేక బయటపడి పొయ్యేది. అప్పటిదాకా గుంభనంగా ఉన్న కృష్ణయ్యగారు కూడా ఒక్కసారి బెంబేలు పడిపోయి మరికొన్ని క్షణాల తర్వాత తెప్పరిల్లుకొని రంగనాయకమ్మను సముదాయించేవారు. ఆ తర్వాత తర్వాత అటువంటి సందర్భం రానీయ కుండా ఆ ఇద్దరూ జాగ్రత్త పడ్డారు అందుకే "ఆ బీరువా తియ్యకమ్మా" అని కృష్ణయ్యగారు రంగనాయకమ్మతో గట్టిగానే చెప్పారు. ఆ పిల్ల ఆయనముందు ఆ బీరువా తెరచి చాలా ఏళ్లు అయింది. అందువల్లనే రంగనాయకమ్మ ఆ నగలు బీరువాలో పెట్టలేదు.

* * *

మరో పదిరోజులతర్వాత ఓనాడు ఉదయం ఆయన దువ్వెన కోసం వెదుకుతూ అలమారా తెరచేసరికి నగలన్నీ క్రొత్తనామూనాల్లో మెరుస్తూ కన్పించాయి రంగనాయకమ్మను పిలిచి 'ఇదేమిటే రంగనాయకీ అన్నీ మార్పించేశావు మరి..." అని ఆగి ఏదో అడగ

బోతుంటే ఆ పిల్ల "తర్వాత అవసరమైనప్పుడు చూచుకోవచ్చునులెండి నాన్నగారూ" అని ధైర్యంగా సమాధానం చెప్పేసి ఇంక ఆ సంభాషణ కొనసాగనివ్వడం ఇష్టంలేక లోపలకు వెళ్ళిపోయింది.

కృష్ణయ్యగారికి రంగనాయకమ్మయందు గౌరవభావం కలిగింది. ఆ పిల్లకు తనయందున్న ప్రేమభావం అర్థమయింది. తత్ఫలితంగా ఆయనకు రంగనాయకమ్మ అంటే మరింత భయంకూడా ఏర్పడింది. "ఇది చాల బుద్ధిమంతురాలు. బాగా ఊహవచ్చినపిల్ల — ముమ్ముందు ఎటువంటి బాధ కలుగనీయకుండా చూడాలి" అని గట్టిగా అనుకొన్నా రాయన. తన్ను బాగా అర్థంచేసుకొని, స్వార్థాన్ని సాధ్యమైనంతవరకు త్యాగం చేస్తున్న రంగనాయకమ్మను లోపల్లోపల ఎంతో అభినందిస్తూ ఆ పిల్లను అనేక విధాల దీవించారు కృష్ణయ్యగారు. ఆయన ఉత్సాహంగా కన్పించారు. "అవును పిల్లలు యిలా త్యాగబుద్ధి అలవర్చుకోవాలి" అనికూడా అనుకొన్నారాయన. ఆ మరునాడు రంగ నాయకమ్మ త్వరత్వరగా పనులుచేస్తూ మధ్యలో పని ఆపి స్నానంచేసి చావడి గదిలోకివచ్చికూర్చున్న తండ్రికి కాఫీ పట్టుకొని వచ్చింది. కాఫీ అందించి వెళుతున్న ఆ పిల్లతో కృష్ణయ్యగారు నెమ్మదిగా "అమ్మాయ్ —ఆ బీరువా తాళం చెవి ఓసారి యివ్వమ్మా...అవి..." అని ఆగారు.

రంగనాయకమ్మ ఆ మాట విన్నదగానే హఠాత్తుగా నిలిచి పోయింది. ఒక్కక్షణంలో ఆ పిల్ల ముఖం వివర్ణమైంది; గుండె దడదడా కొట్టుకున్నది. ఇన్ని ఏళ్లనుండి పవిత్రంగా. జ్ఞాపకార్థంగా ఉంచుకొన్న వాటిని తండ్రి పంచబోతున్నారని తెలియవచ్చేసరికి రంగనాయకమ్మ తట్టుకోలేకపోయింది, కొన్ని క్షణాలదాకా ఆ పిల్లకు అడుగు ముందుకు సాగలేదు.

కొంతసేపు తర్వాత ఆ పిల్ల అతికష్టం మీద తెప్పరిల్లుకొని నిలువద్రొక్కుకొని, ఆయన మాటలు సరిగా వినపడనట్లుగా, విన్పించనప్పుడు మళ్లీ ఏమన్నా అంటరేమోనని వేచివున్నట్లుగా క్షణం పాటుఉండి వెళ్ళుతున్నట్లుగా ముందుకు అడుగు వేసింది.

ఇంతసేపూ కాఫీచెంబు చూస్తూ ఏదో పరధ్యానంలో ఆయన ఉన్నవారల్లా కూతురుఅలా వెళ్ళబోవడం గమనించి "అమ్మాయ్" అని ఆమళ్ళీ అడగ బోతుండగా "మళ్ళావస్తా నాన్నగారూ, పాలుపొయ్యిమీద ......" అని అంటూ ఆ పిల్ల వెనక్కు తిరిగిచూడకుండానే త్వర త్వరగా వంటఇంట్లోకి వెళ్ళిపోయింది. ఆయన పది నిముషాలదాకా అట్లాగే కూర్చున్నారు. కాని రంగనాయకమ్మ రాలేదు.

కూతుర్ని పిలుద్దామని ఒకటి రెండు సార్లు అనుకొన్నారాయన. కాని అల్లా మరికొంతసేపు గడిచాక, ఆ గది గుమ్మందాకా వెళ్ళి "అలా వెళ్ళివస్తా తలుపులు వేసుకో అమ్మాయ్" అని పెద్దగా చెప్పి ఇక ఆ విషయం మర్చిపోయినట్లుగా వెళ్ళిపోయారు.

ఆ పూట పదిగంటలకు భోజనం పూర్తిచేసు ఇస్త్రీబట్టలు వేసుకొని బ్యాంకు కచేరికి వెళ్లడానికి సిద్ధమైనప్పుడు వీధి గుమ్మందాకా తన వెనకే మూగపిల్లలా నిశ్శబ్దంగా వచ్చిన రంగనాయమ్మతో ప్రొద్దుటి విషయమే మళ్లీ ప్రస్తావించుదా మనుకొన్నారు కృష్ణయ్యగారు. ఆయన చొక్కా వేసుకొని తల దువ్వుకుంటున్నప్పుడు ఆ ప్రయత్నంగా ఒకటి రెండు సార్లు ఆ బీరువాకేసి చూచారు - ఆపనికూడా ముగించుకుంటే మంచిదను కొంటూ. అల్లాచూడడమదీ రంగనాయకమ్మ గమనించిందనికూడా ఆయన తెలుసుకున్నారు. అప్పుడుకూడా ఆ విషయం ప్రస్తావించాలని ప్రయత్నించారు. కాని తొందరేముందిలే పోనీ రేపు చూచుకోవచ్చు అనుకున్నారు. మళ్లీ అంతలోనే ఇప్పుడూ

అల్లాగే అనుకున్నారు కృష్ణయ్యగారూ. అల్లా అనుకుంటూ ఆయన నెమ్మదిగా ఆఫీసుకు వెళ్లిపోయారు. "జాగ్రత్త అమ్మాయ్ తలుపు వేసుకో'' అని చెప్పి వెళ్లారాయన.

కృష్ణయ్యగారు ఆ పిల్ల విషయమే ఆలోచించుకొంటూ వెళ్లారు.

రంగనాయకమ్మకు పూర్వంలో కూడా—తల్లితోకంటె తండ్రితోనే ఎక్కువ అనుబంధం ఉండేది. సినిమాకు వెళ్లినా, షికారుకు వెళ్లినా, దగ్గర ఊళ్లకు బంధువుల ఇళ్ళకు వెళ్లినా, తండ్రితోనే వెళ్లేది. "దీనికి నేనంటేనే ఎక్కువ ఆపేక్ష, ఇది ఎంతో బుద్ధిమంతురాలే" అనేవారు కృష్ణయ్యగారు భార్యతో. ఆ తర్వాత ఆపిల్ల తల్లిపోయిన క్రొత్తరోజుల్లో కృష్ణయ్యగారి తండ్రివచ్చి అక్కడ కొన్ని నెలలపాటు ఉండి వెళుతూ రంగనాయకమ్మను తన వెంట తీసుకొని వెళతానన్నారు. కాని రంగనాయకమ్మ రానన్నది. తాతగారింట్లో తనకు చాలా సుఖంగా గడుస్తుందని బాగా తెలిసికూడా అక్కడికి వెళ్లలేదు అప్పుడే కృష్ణయ్యగారు "నాకు మొదటనుండీ తెలుసు. ఇది ఎంతో బుద్ధిమంతురాలవుతుందని" అనుకున్నారు. అప్పటి విషయాలన్నీ ఒకటొకటీ నెమ్మదిగా జ్ఞాపకం చేసుకొంటూ కృష్ణయ్యగారు ఆఫీసుకు చేరుకొన్నారు.

ఆయనా పూట తృప్తిగా కనిపించారు. ఆయన మామూలుకంటె ముందుగా సరిగ్గా అయిదు గంటలకే ఇంటికి తిరిగి వచ్చారు.

అల్లా ఇంటికి వచ్చేసరికి ఇల్లు తాళం పెట్టి ఉండడము చూచి కృష్ణయ్యగారు "ఇదేమిటబ్బా - ఇప్పుడు తాళం వేసున్నదీ!" అని అనుకొంటూ ఆశ్చర్యపడ్డారు. తన దగ్గర ఉన్న రెండోతాళం చెవితో తాళం తీస్తూం "ఈవేళప్పుడు రంగనాయకి ఎక్కడికి వెళ్ళి ఉంటుంది

చెప్మా॥" అని తన్ను తానే ప్రశ్నించుకొన్నారాయన. తలుపు తీసుకొని లోపలకు వెళుతూ "బహుశా దాని స్నేహితురాలు మరెవరున్నారూ ఆ లీల వచ్చి వుంటుంది మళ్ళీ వాళ్ళింటికి రమ్మని బలవంత పెట్టి ఉంటుంది" అనుకొన్నారు.

అల్లా అనుకొంటూ కృష్ణయ్యగారు ముందు గదిలోనుండి చావడి గదికి వెళ్ళారు. ఆ గదిలో అడుగు పెట్టగానే ఆయనదృష్టి బీరువామీదికిపోయింది. బీరువా తలుపు దగ్గరగా వేసి ఉన్నది. ఇతర తాళంచెవుల గుత్తి దానిమీదుగా వ్రేలాడుతున్నాయి. కృష్ణయ్యగారికి ఒక్కక్షణ కాలం ఏదోభయం వేసింది. ఆయన చప్పున చావడి నాల్గువైపులా చూచారు. ఆ తలుపు మూసేఉన్నది. ఆయన చప్పున అలమార దగ్గరకు వెళ్ళారు. మళ్ళీ అంతలో వెనక్కు తిరిగి పెట్టలవంక చూచారు. చరచరా వెళ్లి బీరువా తాళంచెవి మీదుగా వ్రేలాడుతున్న తాళాలగుత్తి తెచ్చి అలమార తెరచి చూచారు. క్రొత్తగా మార్పించిన నగలన్నీ అక్కడే పూర్వంలా మెరుస్తూ కన్పించాయి.

ఆయన మళ్లీ అన్నివైపులా కలయచూచారు. ఎక్కడి వస్తువులు అక్కడే ఉన్నాయి.

అంతా సవ్యంగా ఉన్నట్లు అప్పటికి దృఢంగా అనిపించి ది. కృష్ణయ్యగారికి. "ఉట్టినే భయపడ్డాను. తాళాలు మర్చిపోయి వెళ్లింది కాబోలు" అనుకుంటూ నెమ్మదిగా బీరువా దగ్గరకు వస్తూ మళ్లీ ఎందుకో ఇది బీరువా తీసినట్లున్నదే, అనుకొంటూ ఆయన బీరువా తీశారు చాలా నెమ్మదిగా. అది చాలా చిన్న బీరువా 2½ అ. వెడల్పు 3 అ. ఎత్తూ ఉన్న చిన్నరకం బీరువా అది. చాలా ఏళ్ల క్రిందట కృష్ణయ్యగారు భార్య కాపురానికి వచ్చిన కొత్తరోజుల్లో కొన్నారది. క్రింద బల్ల పెట్టి దానిమీద ఆ బీరువా ఎత్తుగా కన్పించేలాగున ఏర్పాటు

చేసుకొన్నది కృష్ణయ్యగారి భార్య. అవిడ తన చీర లవీ అందులో పెట్టుకునేది. మరెవ్వరినీ అందులో దాచుకోనిచ్చేదికాదు కూడాను. ఆ బీరువా అప్పటినుంచీ అల్లాగే కదలకుండా ఉండిపోయింది. బీరువా తలుపుతీస్తూ కష్ణయ్యగారు పాత సంగతులన్నీ ఒకసారి జ్ఞావకం చేసుకొన్నారు. అందువల్లనే ఆ తలుపు తెరవడానికి ఆయనకు ఎంతోసేవు పట్టింది. ఆయన నెమ్మదిగా తలువు తెరచి చూచారు. ఉన్న రెండు అరలూ నోర్లు తెరుచుకొని చూస్తున్నాయి. అదిచూచి కృష్ణయ్యగారు నిర్ఘాంతపోయారు

ఆయన మరికొన్ని క్షణాల తర్వాత వెనక్కు తిరిగి చూచారు. ముందు గదిలోకి వెళ్లే ద్వారంపైగా వేళ్లాడుతున్న ఫొటో కన్పించింది వెంటనే కలిగిన జ్ఞాపకాలను వెనక్కు నెట్టేసుకుంటూ ఆయన మరల బీరువా అరలకేసి పరీక్షగా చూచారు. ఒక అరలో మూలగా ఒక చిటీ కన్పించింది. అది తీసుకొని అందులోచదువవలసినది చాలా ఉన్నదేమో ననుకుంటూ ఆయన వెళ్ళి పడక కుర్చీతో కూర్చుని మడతలు విప్పి నింపాదిగా చదవడం మొదలు పెట్టారు. అది చదవడానికి ఎంతోసేవు పట్టలేదు— ఉన్న రెండు ముక్కలూ ఆయన అలవాటు చొప్పున పెద్దగా చదివారు

నాన్నగారూ !

నేను తాతయ్యగారింటికి వెళ్ళుతున్నాను. ఇలా వస్తున్నట్లు తాతయ్యకు వ్రైరిచ్చాను మీరు ఏమీ అధైర్యపడవద్దు బీరువా నేనే తీశాను. ఆ చీరెలవీ పట్టుకుపోతున్నాను కాని అవినేను కట్టుకోనండీ నాన్నగారూ ! భద్రంగా దాచి ఉంచుకొంటా నవి...కారణం మరేమి లేదు... మా అమ్మ చీరెలు మరొకరు కట్టుకుంటే నేను చూడలేను నాన్నగారు !

కృష్ణయ్యగారు ఆ జాబు చదవడం పూర్తి చేశారు.

ఆయన మళ్లా దాన్ని క్రిందినుంచి పై దాకా పైనుండి క్రిందిదాకా చూచారు.

కృష్ణయ్యగారికి రంగనాయకమ్మ తన పక్కగా నిలబడి తనవంకే పెద్దకళ్ళు చేసుకొని అమాయకంగా చూస్తూ నెమ్మదిగా వినయంగా, ఏదో భయపడుతూనే కాని స్పష్టంగా, అంటున్నట్లుగా, ఆ మాటలు అప్పుడు విన్పిస్తున్నట్లుగా అన్పించింది. "మా అమ్మ చీరలు మరొకరు కట్టుకుంటే నేను చూడలేను నాన్నగారు!"

---